క్లుప్తంగా

చెన్నూరు సీఐగా పార్థసారధి



చెన్నూరు: చెన్నూరు పోలీస్ స్టేషన్ మొదటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పార్థసారధి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చెన్నూరు పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

సెబ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాయుడు

ముద్దనూరు: స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా ఆత్మకూరులో సీఐగా విధులు నిర్వహిస్తున్న నాయుడు ముద్దనూరుకు బదిలీపైవచ్చారు.ఇక్కడ పనిచేస్తున్న చెన్నారెడ్డి కర్నూలు జిల్లా బాపురము చెక్‌పోస్టు బదిలీపై వెళ్ళారు.

వ్యాసరచన పోటీలు



పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దివిజా

వేంపల్లి : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ వ్యాసరచన పోటీలను ఎంపీడీఓ దివిజా సంపతి పరిశీలించారు. మండలంలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోచదువుతున్న 80 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు వేంపల్లి గురించి నా మాటల్లో అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఘనంగా వార్షికోత్సవం

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని కదిరిరోడ్డులో వెలసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి ఆకుపూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నియమాలు పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ బి.వి.ప్రసాద్, ఎస్ఐ అరుణ్‌రెడ్డి

పులివెందుల రూరల్ : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్, ఎస్ఐ అరుణ్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు అధిక లోడుతో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అతివేగంగా వెళ్లడం వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆటోరిక్షా డ్రైవర్లకు స్టిక్కర్స్ వేయించుకోవాలని అవగాహన కల్పించారు. మధుసూధన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాను విజయవంతం చేయండి



నాయకులతో చర్చిస్తున్న వైఎస్ మధురెడ్డి

తొండూరు : తొండూరు మండలంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే వైఎస్సార్ ఆసరా విజయవంతం చేయాలని తొండూరు మండల వైయస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వైఎస్ మధురెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో తొండూరు మండల వైయస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండల అధ్యక్షులు రవీంద్రారెడ్డి, మండల పరిశీలకులు రామమునిరెడ్డి పాల్గొన్నారు.

జై శ్రీరామ్..

రామనామంతో ఊరూవాడా పులకించిపోయింది. పానకాలు పంపిణీ చేస్తూ కొందరు.. చెక్క భజనలు..కోలాటాలాడుతూ మరికొందరు.. జెండాలు చేతబూని తన్మయత్వంతో మునిగిపోయిన వారు ఇంకొందరు.. అవును.. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు ఆధ్యాత్మిక జల్లుల్లో నిండుగా తడిసిపోయారు.



చక్రాయపేటలో శ్రీరామ చిత్ర పటం ఊరేగింపు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, అచ్చవెల్లి, రాగిమానుపల్లె, మోట్నూతనపల్లె, నల్లగొండువారి పల్లె గ్రామాల్లోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రాహ్మణపల్లి రోడ్డులోని శ్రీరామా హాల్ వద్ద శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు అభిషేకాలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని మెయిన్ బజార్‌లోని ఉన్న రామాలయంలో ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో సంకీర్తనలు, విష్ణు సహస్రనామం నిర్వహించారు.

వాడవాడలా వేడుకలు

చక్రాయపేట: గండి క్షేత్రంలో ప్రత్యేక రథంపై శ్రీరాముడి చిత్ర పటాన్ని ఉంచి క్షేత్రోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు.చక్రాయపేటలోని శ్రీవేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయాల వద్ద చేర్మెన్ రామాంజనేయరెడ్డి,సభ్యులు రంగారెడ్డి హరినాథరెడ్డి, రామచంద్రారెడ్డి,యోగీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

శ్రీరాముని గ్రామోత్సవం

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల కేంద్రంతో పాటు గురిజాల, కోవరంగుట్టపల్లె, వివిధ గ్రామాల్లో శ్రీరాముని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో మహిళలు కోలాటాలు చేశారు.

నలుదిక్కులా శ్రీరామ నామస్మరణ

జమ్మలమడుగు:పట్టణంలోని నేతాజీ నగర్ మెయిన్ బజార్, ఎస్సీ కాలనీ, పార్కువీధి,నాగులకట్ట, కన్నెలూరులోని రామాలయాలల్లో ప్రత్యేక పూజలతో పాటు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పండుగలా గ్రామోత్సవం

వేముల: మండలంలోని భూమయ్యగారిపల్లె, చింతలజూటూరు, రాచకుంటపల్లి, పెద్దజూటూరు గ్రామాల్లో శ్రీరాముని చిత్రపటం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వి.కొత్తపల్లె గ్రామంలోని శ్రీరామాలయంలో మహిళలు భక్తి పాటలు ఆలపిస్తూ భజనలు చేశారు. గొందిపల్లి, సిద్ధంరెడ్డిపల్లె గ్రామాల్లో శ్రీరాముని భక్తిగీతాలను ఆలపిస్తూ ఏర్పాటు చేసిన మహిళల కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

అంతా రామమయం

పులివెందుల టౌన్ : స్థానిక నరగిగుట్ట శ్రీరాముని ఆలయంలో సీతారామ లక్ష్మణ, హనుమానునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితోపాటు మున్సిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌ఛార్జులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

- స్థానిక పాతమార్కెట్ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం పూజారి వేణుగోపాలా శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- పులివెందుల పట్టణంలోని పాతబస్టాండు శ్రీవేంకటరమణుడి ఆలయంలో ఆయోధ్యను తలపించేలా అయోధ్యరామాలయం నమూనాను అందంగా తీర్చిదిద్దారు. ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు.

మార్మోగిన రామ నామస్మరణ

వల్లూరు: వల్లూరులోని ఆలయాల్లో భజన కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్ర శ్రీరాముడి చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. పెద్దపుత్తలోని యోగా రామాలయంలో అభిషేకాలను నిర్వహించారు. మధ్యాహ్నం మాజీ కార్పొరేటర్ వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, గోటూరు తదితర గ్రామాల్లో భజనలను, అన్నదానాలను నిర్వహించారు.

వైభవంగా సాగిన సీతారాముల కళ్యాణం

వీరపునాయునిపల్లె: మండలంలోని పలు రామాలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణం వైభవంగా సాగింది. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామోత్సవంలో మహిళలు, యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రామాలయంలో కలశ పూజ

చెన్నూరు : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకొని మండల కేంద్రమైన చెన్నూరు ప్రధాన రామాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భారీ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. సాయంత్రం వివిధ గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు.

ఘనంగా గ్రామోత్సవం

ముద్దనూరు: ముద్దనూరు మండల కేంద్రంలో రామాలయం నుంచి మహిళా భక్తులు నృత్యాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీరాముని శోభాయాత్ర

పులివెందుల టౌన్ : స్థానిక వెంకటాపురం గ్రామంలో అయోధ్య రామమందిరం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం శ్రీరాముని శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. వెంకటాపురంలో సింగిల్‌విండో ప్రసిడెంట్ ఆంజనేయులునాయుడు, మున్సిపల్ కోఆప్షన్‌మెంబర్ దాసరి చంద్రమౌళి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

మండల వ్యాప్తంగా..

వేంపల్లి : మండల వ్యాప్తంగా ప్రతి రామాలయంలో బాలరామునికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పురవీధుల గుండా శ్రీరాముని చిత్రపటాలను బ్యాండ్ వాయిద్యాలు, కోలాటాలతో ఊరేగింపు చేశారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.

పూజలు, అన్నదానాలు

లింగాల : లింగాల మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రామాలయాల్లో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు రామాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు.

కలశపూజ

పెండ్లిమర్రి: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వెల్లటూరు గ్రామంలో అంజనేయస్వామి గుడి వద్ద నుంచి మహిళలతో ఆలయ నిర్వహకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో కలశ పూజ నిర్వహించారు. కోలాటం మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.



ముద్దనూరులో గ్రామోత్సవంలో శ్రీసీతారామలక్ష్మణ విగ్రహాల అలంకరణ



వేంపల్లి: శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



అంబకపల్లె రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములు



చెన్నూరు: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పులివెందుల టౌన్: నగరగుట్ట రామాలయంలో..



వేముల: వి.కొత్తపల్లె రామాలయంలో భక్తి పాటలు



పులివెందులలో శోభాయాత్ర



యర్రగుంట్ల పట్టణంలో వివిధ వేషధారణలు..



దుగ్గాయపల్లెలో శ్రీ సీతారాముల గ్రామోత్సవం

రైతుల సంక్షేమానికి అండగా ప్రభుత్వం

– కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లి : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరాంపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ.. ప్రభుత్వమే రైతులనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారని తెలిపారు. వేంపల్లి జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి గాయత్రి, సర్పంచులు శ్రీనివాసులు, మునేష్, మాజీ సర్పంచ్ రామాంజనేయులరెడ్డి, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తదితరులు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పులివెందుల రూరల్ : మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారి ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డులోని దాసరి కొండమ్మ వాటర్ ప్లాంట్ సమీపంలో మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ప్రభుత్వం అందించే రుణాల ద్వారా తమ కాళ్ల మీద నిలబడి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, మెప్మా సీఎంఎం రాజేశ్వరి, మెప్మా అధికారులు నాయుడు, నాగన్న, సివిల్ సప్‌లై డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, కౌన్సిలర్లు కిశోర్, రాజశేఖర్ పాల్గొన్నారు.



పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమం

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నాగులకట్ట ప్రాంతం, వెంకటేశ్వర, భాగ్యనగర్ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకోవడంతోపాటు ఆ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీటవేశారన్నారు. మేనిఫెస్టో పవిత్రమైనదిగా భావించి వాటిని అమలు చేశారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ,హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మి, కెకె రమణారెడ్డి, పాలూరు నరసింహులు,కౌన్సిలర్లు ముల్లాజానీ, పోచిరెడ్డి పాల్గొన్నారు.



పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

సీసీ రోడ్డు పరిశీలన

ఎర్రగుంట్ల:మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ఆర్టీపీపీ రోడ్డున ఉన్న గుంత బజార్ రోడ్డుకు మోక్షం వచ్చింది. సోమవారం ఈ రోడ్డు పనులను ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి మాట్లాడుతు గుంత బజార్‌లోని 1,2,3 వీధిలు గుంతలు పడి చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి ఇబ్బందులు పడేవారన్నారు. స్థానికులు అడిగిన మేరకు వెంటనే సీసీ రోడ్డును మంజూరు చేయించామన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

పులివెందుల రూరల్ : మాదిగల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ పార్లమెంటరీ సీట్లు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మాదిగలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. అనంతరం ఫిబ్రవరి 8న జరిగే మాదిగల రాజకీయ సభలను విజయవంతం చేయాలని పోస్టర్లు విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశు, సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, భరత్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు ఎస్ఐగా వెంకట రమణ బాధ్యతల స్వీకరణ

వల్లూరు: వల్లూరు ఎస్ఐగా కే వెంకట రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న పెద్ద ఓబన్నను కొద్ది రోజుల క్రితం ఉన్నతాధికారులు సిద్ధవటం ఎస్ఐగా బదిలీ చేశారు. దీంతో ఖాళీగా వున్న ఈ స్థానంలో కడప వీఆర్‌లో వున్న ఎస్ఐ వెంకట రమణను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జీపు స్టాండు ప్రారంభం



జీపులస్టాండును ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక కడప రోడ్డులో ఏర్పాటు చేసిన జీపు, కారులకు సంబంధించిన శాశ్వత జీపుల స్టాండును సోమవారం మున్సిపల్ ఇన్‌ఛార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ తమసమస్యపై వెంటనే స్పందించినందుకు డ్రైవర్ అసోషియేషన్ సభ్యులు వైఎస్ కుటుంబానికి ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, సివిల్‌సప్‌లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్చార్జ్ పార్నపల్లికిశోర్ పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలు

- ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే

కమలాపురం: ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, పార్టీ పుట్టినప్పటి నుంచి కార్యకర్తలు ఇష్టపూర్వకంగా పని చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కార్యకర్తలను కొనియాడారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అధ్యక్షతన నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన పార్టీ ప్రజల మనసు, హృదయాల్లో నుంచి పుట్టుకొచ్చిందన్నారు. మేనిఫెస్టోను ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన పార్టీ కూడా మనదేనన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఎక్కడైనా వర్గ విభేదాలు ఉంటే వాటిని పక్కన పెట్టి సమస్యలను అధిగమించి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. మెనిఫెస్టోలో 690 హామిలిచ్చి చంద్రబాబు విస్మరించాడని, జగనన్న అందుకు భిన్నంగా చెప్పని హామీలను సైతం అమలు చేశారన్నారు. 85శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రస్తుతం ప్రతి కార్యకర్త ప్రతి ఇంటి తలుపు తట్టి వారు పొందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించాలన్నారు. క్యాడర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నెల 25న వైజాగ్‌లోని భీమిలిలో సీఎం వైఎస్ జగన్ క్యాడర్‌తో సమావేశం నిర్వహిస్తున్నారని, ఇందులో క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, చెన్నకేశవరెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, మస్తానయ్య, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, హిదాయత్, ఇస్మాయిల్, భాస్కర్, లక్ష్మీనారాయణరెడ్డి, రామ సుబ్బారెడ్డి, దేవదానం, నిఖిల్,సుధీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

ముగిసిన శిక్షణ

వీరపునాయునిపల్లె: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి డివిజనల్ గణాంకాధికారి రామమోహన్, కమలాపురం సహాయ గణాంకాధికారి ఇర్షద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడా రు. పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ఆవశ్యకత గురించి రైతు భరో సా సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన సేవలు

వేంపల్లి : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేంపల్లె పట్టణం బలిజ సంఘం వీధిలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందించిన ఆరోగ్యశ్రీ కార్డు పరిమితి రూ. 5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరో గ్యశ్రీ కార్డు ద్వారా ఏఏ వ్యాధులకు వైద్య పరీక్షలు అందుతాయో క్లుప్తంగా వివరించారు. భాజా, వైద్యులు స్వాతిసాయి, నిజాముద్దీన్, హెల్త్‌ఎడ్యుకేటర్ షఫీవున్నీసా పాల్గొన్నారు.

వేలము ప్రకటన

కడప జిల్లా, సింహాద్రిపురం (మం), అహోబిలాపురం గ్రామంలో వెలసిన శ్రీ భానుకోట సోమేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించి తలనీలాలు పోగులు చేసుకొను హక్కు, టెంకాయలు అమ్ముకొను హక్కులకు గాను 29.01.2024వ తేది ఉదయం 11.00 గంటలకు దేవస్థానము వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించబడును. తలనీలాల పాటకు రూ. 20,000/-, టెంకాయల వేలం పాటకు రూ. 5,000/- లు ధరావతు చెల్లించవలయును. తక్కిన వేలంపాట షరతులు వేలంరోజు తెలుపబడును.

ఇట్లు: కార్యనిర్వహణాధికారి మరియు గ్రామ పెద్దలు

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ

కమలాపురం: కమలాపురం పట్టణ పరిధిలోని కె. అప్పాయపల్లె ప్రధాన రహదారి నుంచి శ్రీనగర్ కాలనీ వరకు సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి భూమి పూజ చేశారు. సోమవారం రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డుకు పార్టీ నాయకులు వంశీధర్ రెడ్డి తదితరులతో కలసి భూమి పూజ చేశారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే అధికారులను, కాంట్రాక్టర్‌ను సూచించారు.

న్యాయం చేయండి సారూ....

కమలాపురం: పిల్లల పెండ్లిళ్లకు అని పోగు చేసుకున్న సొమ్ము అంతా పోస్టల్ అధికారిణి స్వాహా చేసింది.. తమకు న్యాయం చేయాలని పందిళ్లపల్లె పోస్టల్ బాధితులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని ఆశ్రయించారు. సోమవారం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే వద్దకు బాధిత మహిళలు చేరుకున్నారు. తినీ తినక పిల్లల పెండ్లిళ్లకని డబ్బులు పోస్టాఫీసులో పోగు చేసుకున్నామని... పోస్టల్ అధికారిణి తమ సొమ్మంతా దాదాపు రూ. 1.20కోట్లు వరకు స్వాహా చేసి ఉడాయించిందని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి జిల్లా ఎస్పీ కి ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న పందిళ్లపల్లె పోస్టల్ బాధితులు